# పడిలేచిన కెరటం

## - గంటి భానుమతి



*(గత సంచిక తరువాయి)*

భయం వేసింది. కాలేజీలో మనుషులని చూడడానికి,వారి ఎదుట పడడానికి భయ పడు తున్నాను. ఎందుకో తెలీదు.!

అందుకే మర్నాడు కూడా వెళ్ళలేదు. అమ్మా వాళ్ళకి అనుమానం వచ్చింది. నుదురు మీద చెయ్యి

వేసి చూసింది. జ్వరం అదీ ఏం లేదు. మరి ఎందుకు మానేస్తున్నట్టూ,అని తనలో తనే అనుకుంటూ, వచ్చింది.

" పైకి బాగానే ఉన్నావు కదా. కాలేజీకి వెళ్ళడానికి ప్రయత్నించకూడదూ. నలుగురి మధ్యలో ఉంటే కొంచెం బావున్నట్లనిపిస్తుంది. వెళ్ళు.నీక్కూడా కొంచెం మార్పు " కాస్త గట్టిగానే అంది.

మళ్ళీ ఛాయిస్ లేదు. వెళ్ళమన్నారు, వెళ్ళాలి. పుస్తకాలు అవీ సద్దుకున్నాను. టైముకి తయారయ్యాను. బస్సుకోసం స్టాపులో నుంచున్నాను. కానీ ఎందుకో లోపల్నించి భయం. రోజూ ఇదే స్టాపులో నుంచుని బస్సెక్కే దానిని. అదే రోడ్డు.ఏ మార్పు లేదు, కానీ నాలోనే మార్పు. భయం అక్కడ ఉండలేక పోతున్నాను. నా పక్కన ఎవరో నుంచున్నారు. రెండు రోజుల్నించి కనపళ్ళేదు. అని అడిగింది. ఆ పలకరించింది ఎవరో వెంటనే గుర్తుకి రాలేదు. ఎక్కడో చూసాను. కాని ఎక్కడో తెలీడం లేదు. ఏదో కొంచెం బాగాలేదు ,అని అన్నాను. ఆమె ఇంకా ఏదో అడగ బోతూండగానే బస్సొచ్చింది. అందరూ ఎక్కడానికి ముందుకెల్నారు. నేను అక్కడే ఉండిపోయాను. ఆమె నన్ను పిలుస్తోంది రమ్మనమని, నేను చూడనట్లు నన్ను కానట్లు ఉండిపోయాను. బస్సు వెళ్ళిపోయింది.

మరో బస్సు వచ్చింది. ఈసారి ఎక్కడానికి ముందుకెళ్ళాను. కాని ఎక్కలేదు. నా వెనకాల వాళ్ళు నన్ను పక్కకి తప్పించి,తోసి ఎక్కుతున్నారు.

నా వెనకాల ఎవరో ఉండి నన్ను తరుముతున్నారు , ముందుకి తోస్తున్నారు. ఆ ఎవరో చూడాలంటే వెనక్కి తిరగాలి. కాని,వెనక్కి తిరగాలంటే భయం. ఓ బస్సు వెళ్ళిపోయింది. మరోటి వచ్చింది ఎక్కలేదు. ఎక్కుతూంటే తోసేస్తారేమో నన్నభయం. రోడ్డంటే భయం వేస్తోంది. బస్సంటే భయం వేస్తోంది.

ఎందుకో ఏంటో తెలీని భయం.కడుపులో ఏదో వికారం, ఇంటికి వెళ్ళిపోవాలి. అక్కడ భయం లేకుండా ఉంటాను. ఇంట్లో ఎవరూ ఉండరు. ఎవరూ వెనక నుంచి రారు. తరిమేయరు. తోసెయ్యరు. ఇంట్లోనే సేఫ్. అందుకే వెంటనే పరుగు పరుగున ఇంటికి వచ్చేసాను. తలుపు తీసిన అమ్మ ఆయాస పడుతున్న నన్ను చూసి కంగారు పడింది. చెమటలు,ఒళ్ళంతా తడిసి పోతోంది.

" ఏం జరిగింది. ఒంట్లో బాగాలేదా ? అప్పుడే వచ్చేసావేంటీ? " అంటూ అమ్మ అడుగుతూనే తలుపు తీస్తూ పక్కకి జరిగింది. నేనేం మాట్లాడ లేదు.

" కాలేజీలో ఏదో జరిగీ ఉంటుంది, నువ్వు సరిగా మాతో చెప్పడం లేదు. అడిగితే ఏం లేదని అంటున్నావు, ఇప్పుడు కూడా అడుగుతున్నాను. ఏం లేదని బుకాయించకు. ఏం లేకపోతే కాలేజీకి ఎందుకు వెళ్ళనంటావు, చెప్పు , ఒంట్లో బావుండడం లేదా. డాక్టరు దగ్గరికెళ్దామా "

నాకు బావుందని చెప్పలేను. బాగాలేదు. అది కూడా చెప్పలేను. ఇంటికి ఎందుకు వచ్చేసానో కూడా చెప్పలేను. కానీ అమ్మ అడిగిందే అడుగుతోంది. ఏం అయింది అని ఓ పది సార్లు అడిగినట్లనిపించింది.

అమ్మమాటలకి లోపల్నించి కోపం వచ్చేస్తోంది.ఎదురుగా ఉన్న అమ్మని గట్టిగా తన్నానిపిస్తోంది "ఎన్ని సార్లు అడుగుతావ్.ఎన్ని సార్లు చెప్పాలి " గట్టిగా అరిచాను. అమ్మ బిత్తరపోయింది.

" ఎన్ని సార్లు అడిగాను ఒక్కసారే కదా అడిగాను. ఆ అడగడం కూడా తప్పేనా. దానికంత గట్టిగా అరిచి సమాధానం ఇవ్వాలా. నీకేదో పిచ్చి పట్టింది ."

"అవును నాకు పిచ్చి పట్టింది. చాలా! పిచ్చి పట్టింది. దెయ్యం పట్టింది. సరేనా. ఇంక వెళ్లు...".అన్నాను గట్టిగా ఏడుస్తూ.

అమ్మ నోరు తెరుచుకుని ఉంది. ఏం మాట్లాడ లేదు. బొమ్మలా నుంచుండి పోయింది. నేను నా గదిలోకి వెళ్ళి పోయి మంచం మీద వాలిపోయాను. నేనెందుకు అమ్మమీద అరిచాను. నాకేం అయింది, అమ్మని అన్నందుకు ఫీలయ్యాను. వెంటనే అమ్మ దగ్గరికి వెళ్ళి సారీ అన్నాను. ఏంటో ఏదో అనేసాను. వెంటనే అమ్మ నన్నుదగ్గరికి తీసుకుని ,ఒక్కసారి గట్టిగా హత్తుకుంది.

కాసేపటికి అమ్మ నన్నుగదిలోకి తీసుకెళ్ళింది. " కొంచెం పడుకో. ఏవేవో ఆలోచనలు మనసులో పెట్టుకున్నావు. అవి నిన్ను ఇలా వీక్ చేస్తున్నాయి. అందుకే నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలీడం లేదు. జరిగిన దాన్లోని మంచి మాత్రం గుర్తు చేసుకో అన్నీ బావుంటాయి " అని దుప్పటీ సరిచేసి వెళ్ళిపోయింది.

"అలాగే " అని అనుకుంటూ మంచం మీద వాలికళ్ళు మూసుకున్నాను.

ఎక్కడి నుంచో అమ్మా,శృతీ అంటూ పిలిచిన గోంతు వినిపించింది. నేను ఏంఅనలేదు.

ఓ పది నిమిషాలయ్యాకా అమ్మ నా దగ్గరికి వచ్చింది. పద,అంది. ఎక్కడికి అన్నట్లు చూసాను

" గుడికి వెళ్దాం. కొంచెం బాగుంటుంది. " అని అంది.

" నాకేం రావాలని లేదు. నేనేం దేవుడి దగ్గరికి వెళ్ళాలని అనుకోడంలేదు. నాకేం కోరాలని లేదు. అసలు నాకు ఇల్లు కదలాలంటేనే భయంగా ఉంది" అని అన్నాను.

" నీ పక్కనే నేనుంటాను , నీకేం భయం లేదు. భయం అని అనుకుంటే అది అలాగే ఉండిపోతుంది. భయం లేదనుకుంటే ఏ భయాలూ ఉండవు, పద,వెళ్దాం "

నేను కదల్లేదు,

" అదిగో ఆ భయం అదీ పోవాలనే కదా గుడికి రమ్మంటున్నది. గుడికి వెళ్తే ఓ విధమైన శాంతి. మన అంతరాత్మ తలుపులని మనమే తెరుస్తాం. మనకి ఏం కావాలో చెప్పుకుంటాం. కళ్ళు మూసుకుంటాం. ప్రార్థిస్తాం.మనల్ని మనం మర్చి పోతాం. ఇవన్నీనువ్వు కూడా ఆ దేవుడి ముందు చెయ్యి. నీ మనసుకి కాస్త,ప్రశాంతత రా తల్లీ. హాయిగా ఉంటుంది " అంది అమ్మ లాలనగా.

చూద్దాం. అమ్మ అన్నట్లు మనసు ప్రశాంతంగా ఉంటుందేమో చూస్తాను. లేచాను. తయారవడానికి ఏం లేదు. కాలేజీకి తయారైన బట్టలు నలగ కుండా ఉన్నాయి.

ఆటో మాట్లాడింది. ఎక్కడానికి కూడా భయపడ్డాను. ఆ డ్రైవరు నన్ను కింద పడేస్తాడేమోనని. కాని అలాంటిది ఏమీ జరగలేదు. జాగ్రత్తగానే వెనక వీధిలో ఉన్న గుడికి తీసుకెల్ళాడు. గుడి చాలా విశాలంగానే ఉంది. మనుషులు కూడా ఎక్కువ మంది లేరు,భక్తులు వచ్చే టైము కూడా కాదు. ఎందుకంటే టైము పది దాటింది. డిసెంబరు నెలేమో, ఎండ ఉన్నా గాలి కూడా ఉంది. ఉన్న నాలుగు చెట్లూ ఊగుతూ చల్లటి గాలినిస్తోంది. అమ్మ అన్నట్లు ఆలయం పరిసరాలూ ప్రశాంతంగా ఉన్నాయి, నేను తొందరగా ఎప్పుడూ గుడికి వెళ్ళను. పండగలప్పుడు మాత్రమే వెళ్ళాను. అది కూడా చాలా చిన్నప్పుడు. పెద్దయ్యాకా చదువులో పడి వెళ్ళడమే మానేసాను.

మళ్ళీ ఇన్నేళ్ళకి గుడికి వచ్చాను. ది శివాలయం. అమ్మ వెనకాలే ప్రదక్షణాలు చేసి లోపలికి వెళ్ళి తీర్థం తీసుకుని,పూజారి ఇచ్చిన గన్నేరు పువ్వుని ,క్లిప్ తో కట్టిన జుట్టులో పెట్టాను. అక్కడ ఉన్నరావి చెట్టు చుట్టూ ఉన్న తిన్నె మీద కూచున్నాం. మేము ఏం మాట్లాడుకోలేదు.

" ఏదో అనుకుంటాం కాని ,ఈ ప్రార్థన అనేది సెల్ఫ్ సజెషన్. నిన్ను నువ్వు ఉత్తేజ పరుచు కోడానికి, కాస్త మనశ్శాంతి కోసం మనం చేసే ఓ ప్రక్రియ మాత్రమే. మానసిక సోమరులం కాకుండా దేవుడు మనకి కొండంత అండగా ఉంటాడు. మనశ్శాంతిని ఇవ్వమని దేవుడిని కోరుకో నీకంతా బాగా అయిపోవాలని. " నిశ్శబ్ధంగా అమ్మ చెప్పినవన్నీ విని తల ఊపాను..ఇంటికొచ్చాక కొంచెం సేపు బాగానే ఉంది. మళ్ళీ మామూలే.భయం చెమట్లు.

నాన్న సాయంత్రం ఇంటికొచ్చారు . అమ్మ ఏం చెప్తోందో అన్నీ వినపడుతున్నాయి. గబగబా నా దగ్గరికి వస్తూనే నుదురు మీద చేయిని వేసారు. జుట్టుని పైకి తోసారు.నా మొహంలోకి చూసారు.

" ఏమ్మా,శృతీ !ఎలా ఉంది? అసలేం జరుగుతోంది? కాలేజీనుంచి వచ్చేసావా?" అంటూ తలని నిమిరారు. ఏం చెప్పలేక ఏడవడం మొదలెట్టాను. ఆపుకోలేకపోయాను.

ఈ ఊరు వచ్చినప్పుడు ఈ కళ్ళల్లో కలలు, గుండెల్లో ఆశలూ ఉన్నాయి. కానీ ఇప్పుడు ఏం లేవు. ఎక్కడికో వెళ్ళిపోయాయి. అందనంత దూరంలో ఉన్నాయి. ఇప్పుడు మాత్రం కళ్ళల్లో నీళ్ళు, గుండెల్లో మోయలేని బరువు. నా వాళ్ళని మోసం చేస్తున్నాను. అంతే కాకుండా నన్ను నేను మోసం చేసుకుంటున్నాను.

ఆ తరవాత, రోజూ కాలేజీకని బయల్దేరడం, వెంటనే భయంతో ఇంటికి వచ్చేయడం, అలా ఇంట్లో వారం రోజులున్నాను. చదువు గురించి ఆలోచించడం లేదు. తిరిగి కాలేజీకి వెళ్ళాలనిపించడం లేదు. అలా అని అమ్మకి నాన్నకి చెప్పలేదు. కానీ వెళ్ళడం లేదు. కాలేజీకి ఎప్పుడు వెళ్తావూ అని ఉదయం లేవగానే అడుగుతున్నారు. కానీ నేనేం సమాధానం ఇవ్వలేదు, వాళ్ళకి ఏం చెయ్యాలో తెలియడం లేదు.

నాన్నగారు కాలేజ్ కి వెళ్ళి మాట్లాడి వచ్చారు. అక్కడ ఏం మాట్లాడారో తెలీదు. నేను అడగ లేదు. తెలుసు కోవాలనిలేదు. నాకు వెళ్ళాలని లేనప్పుడు అడిగి లాభం ఏం ఉంది? ఏదో స్థబ్దత నన్ను చుట్టెస్తోంది. మంచం మీద ఎంత సేపని పడుకుంటాను. అందుకని చేతికొచ్చిన పుస్తకం తీసి చదవడం మొదలు పెట్టాను. ఏం చదువు తున్నానో నాకేం తెలీడంలేదు. చదివింది మర్చిపోతున్నాను. చాలా సార్లు ప్రయత్నించాను, అసలు ఏం చదువుతున్నానో నాకేం అర్థం కావడం లేదు. ఎందుకిలా అవుతోంది ?

ఎప్పటికీ ఇంతేనా? ఇలాగే మొద్దులా ఉండిపోతానా ? ఏం చెయ్యాలో తెలీడంలేదు. కోపం వచ్చేస్తోంది ,నా మీద నాకే కోపం. ఏం చేయాలో తోచక అటూ ఇటూ చూసాను. అంతే , చదవలేక పోతున్నానన్న కోపంతో చేతిలో ఉన్న పుస్తకాన్ని విసిరేసాను. ఆ పుస్తకం అక్కడ టేబుల్ మీద ఉన్న కాఫీ కప్పు, మంచినీళ్ళ సీసా,మీద పడింది. వెంటనే ఆ రెండూ కూడా ఒక్కసారి కింద భళ్ళుమని శబ్దం చేస్తూ పడ్డాయి. ఆశబ్ధానికి ఒక్కసారి భయ పడ్డాను..

వెంటనే కంగారు పడుతూ అమ్మ గదిలోకివచ్చింది " ఏంటీ శబ్ధం? ఏం పడిపోయింది? " అని జరిగింది తెలుసుకోడానికి అమ్మ గదిలోకి వచ్చింది. వస్తూనే నన్నూ,కింద పడిన వాటినిచూసింది.

" అహఁ ఏం లేదు. టేబుల్ తుడుస్తూంటే ఆ రెండూ కింద పడ్డాయి " అని అన్నాను. ఆ అనడంలో భయం అమ్మ కనిపెట్టింది. వెంటనే నా దగ్గరికి వచ్చింది.

" ఏం పర్వాలేదు. కప్పు విరిగిందని భయపడుతున్నావా? ఏం పరవాలేదు.కంగారు పడకు , లోపల ఇంకా చాలా ఉన్నాయిలే" అని అనునయంగా మాట్లాడింది.

అమ్మ ఓ సారి నన్ను చూసి ,వెళ్ళిపోయింది. అమ్మ వెళ్ళిపోయినా భయం ఎక్కువైంది . ఆ భయం రాను రానూ నొప్పిగా మారింది. భరించలేని నొప్పి. అర్థం లేని భయం, అర్థం లేని ఆలోచనలు, నేను డిప్రెషన్ లోకి వెళ్తున్నాననిపిస్తోంది. డిప్రెషన్ అంటే ఇదా? ఇలాగే ప్రవర్తిస్తారా ? అమ్మ అన్నట్లు నాకు పిచ్చా,ఇది ఓ రకమైన పిచ్చా? అంటే. నేను. ఆలోచించలేను. నాకు పిచ్చి అన్న విషయాన్నినేను ఊహించలేను. జీర్ణించుకోలేక పోతున్నాను. కత్తి తీసుకున్నాను. నన్ను నేను బాధ పెట్టుకోవాలి. శిక్షించుకోవాలి, అప్పటికిగాని,ఈ బాధలు తగ్గవు.

కత్తి తీసాను. మణికట్టు దగ్గరగా పెట్టి కోసుకోబోయాను. ఇక్కడ కోస్కుంటే రక్తం కింద పడుతుంది. కింద అంతా అసహ్యంగా అవుతుంది. బాగా ఆలోచించి బాత్రూం లోకి వెళ్ళాను. మణికట్టు దగ్గర కోసుకోబోయాను. ఎలా వచ్చారో ఎప్పుడు వచ్చారో నాన్న వచ్చి నా చేయి పట్టుకున్నారు. నాన్న వస్తారని అనుకోలేదు. కాని అప్పటికే కొంచెం గీసుకుని పోయింది. గాయం అయిన దగ్గరనుంచి రక్తం కారుతోంది. దాన్ని చూసి నాన్న షాక్ తిన్నారు..

" ఆఁ ఆఁ. అదేంటీ ?ఏంటిది? ఏంచేస్తున్నావ్? " అన్నారు గట్టిగా. ఆ గొంతులో బాధ స్పష్టంగా తెలుస్తోంది. ఆ మాటలు విన్న వెంటనే అమ్మకూడా పరుగున బాత్రూం లోకి వచ్చింది. కనిపిస్తున్న దృశ్యం చూసి నోరు తెరిచింది

“అయ్యో.అయ్యో. ఇదేంటీ ? ఆ రక్తం ఏంటీ ? ఈ కోత ఏంటే ? చేతిలో ఆ కత్తేంటీ, నీకేం అయిది?.ఏమైనా పిచ్చా వెర్రా !” అంటూ అమ్మ ఏడుపు మొదలు పెట్టింది.

నాకు ఏం చేయాలో తెలీలేదు. తప్పు చేసినట్లుగా తలొంచుకని నేను అలాగే బాత్రూంలో కూచుండి పోయాను. కదల్లేదు. వెర్రిగా నేల వైపు చూస్తూండిపోయాను. అమ్మ మెల్లిగా నన్ను లేవదీసింది. నేను చిన్నపిల్లలా ,లేచి వాళ్ళతో గదిలోకి వెళ్ళాను. నాన్న దూదితో మణికట్టు కడిగి శుభ్రం చేసి మందు రాసారు.

“నాలుగురోజుల క్రితం కూడా ఇలాంటిదే ఏదో చేసినట్టుంది. ఇలాగే మణికట్టు మీద గీరలున్నాయి. ఏంటని అడిగాను. ఏదో చెప్పింది.అయితే ఆ రోజున కూడా ఇలా కోసుకుందా? అసలు ఐడియా కూడా రాలేదు, ఇది ఇలా కూడా చేయగలదని. ఏళ్ళు వెడుతున్నకొద్దీ మొద్దులా తయారవుతోంది. ఇది ఏంటిల్లా తయారయింది ” అని అమ్మ అంటూంటే నన్ను కానట్టు ఉన్నాను.

“ పడుకో. భయంగా ఉంటే మా గదిలో పడుకో. మేము ఇక్కడే ఉంటాం ”

నా గురించి నిజంగానే బాధ పడుతున్నారు. నేను వీళ్ళని తప్పుగా అర్థంచేసుకున్నాను. వీళ్ళు నా శతృవులనుకున్నాను. కానీ కాదు. వాళ్ళు నా దగ్గరికి వద్దామని ప్రయత్నిస్తున్నారు కానీ నేనే దూరం జరిగిపోతున్నాను. ఓ గూడులో ఉండిపోతున్నాను. నన్ను నేను ఓ ఖైదీగా చేసుకున్నాను. అందులోంచి బయటికి రావడానికి ఇష్టపడడంలేదు. ఎవరితో మాట్లాడడానికి ఇష్టపడడంలేదు. ఒంటరితనాన్ని కోరుకుంటున్నాను. అలాగే మంచం మీద వాలిపోయాను. ఎంత సేపున్నానో తెలీదు. అమ్మ వచ్చింది. నా నుదురు మీద చేయి వేసింది. ఆ చేతిని అలాగే పైకి జరిపి జుట్టు సవరించింది.

“ లే,కొంచెం అన్నం తిను.నాన్నగారు కూచుని ఉన్నారు”

అన్నం తినే టైమయిందా. అంత సేపు పడుకున్నానా నాకసలు తినాలని లేదు. తినకపోతే బాధ పడతారు. వెళ్ళి నాన్న గారి పక్కన కూచున్నాను. వాళ్ళ సంతృప్తి కోసం తింటున్నాను.

అమ్మ పక్కన కూచుని కొసరి కొసరి తినిపిస్తోంది. బలవంతంగా తింటున్నాను

ఇలా ఎన్నాళ్ళు ?ఎందుకిలా చేస్తోంది ? పోనీ ఏదైనా డాక్టరు దగ్గరికి వెళ్దామంటే,ఏం చెప్తాం ?ఏ రోగం ఉందని తీసుకెళ్తాం? ప్రాబ్లెం ఏంటీ అంటే ఏం చెప్తాం? అసలు ఇది ఏంటో మనకి ఎవరు చెప్తారు ?

నేను వాళ్ళిద్దరిని చూస్తున్నాను. నిజమే. నాకు ఏంటి? ఏ రోగం ఉంది ? ఏం తెలీడం లేదు? ఎవరు చెప్తారు?

“సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకెళ్తే బావుంటుంది” అని నాన్నగారు తిరిగి అన్నారు.

“ అంటే శృతికి” అమ్మ ఆపేసింది. ఆ తర్వాత మాటని అనలేక పోయింది.

“అదేం కాదు. కానీ ఎందుకైనా మంచిది, ఓ సారి సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకెళ్తే బావుంటుందని నాకనిపిస్తోంది. ఎందుకంటే శృతి చేస్తున్నది ,నార్మల్ గా లేదు. ఆ కోపం,అరవడాలూ,ఏడవడాలు, చేయి కోసుకోడాలూ ఇవి మామూలు వాళ్ళు ఎవరూ చేయరు” అని అన్నారు

“అందరికీ తెలిస్తే ఏంవనుకుంటారూ ? కొన్నిరోజులు పోతే అదే సద్దుకుంటుంది ”

"ఎవరికో తెలుస్తుందని దాన్ని ఇలా నరకంలో ఉంచేస్తామా! చెప్పు,ఇప్పుడది కాలేజీ మానేసింది . ఇంట్లో ఉట్టిగా కూచుంటోంది. ఇలా మామూలుగా పిల్లలెవరూ చెయ్యరు. ఒక్కొక్క సారి దాని పిచ్చి కోపం చూస్తే అర్థం అవుతోంది. దానికి ఏదో మెంటల్ ప్రాబ్లెం ఉందని. ఎంతో యాక్టివ్ గా ఉండేది. ఇప్పుడ అలా లేదు అంటే ఏదో లోపం అనే అనిస్తుంది. మనం ఓ డాక్టరు దగ్గరికి వెళ్ళాల్సిందే,నువ్వేం అడ్డు చెప్పకు."

అమ్మ ఏడుస్తోంది.నాన్న ఏదో అంటున్నారు.

వాళ్ళ దృష్టిలో నేను నార్మల్ గా లేను, నన్ను ఓ డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళాని కదా వాళ్ళు అను కుంటున్నారు. అంటే డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళే స్థితిలో ఉన్నానంటే నేను ఓ పేషెంటుని. ఆ సంగతి నన్ను అడగాలి గదా. ఏంటమ్మా ఏం అవుతోంది, ఓసారి డాక్టరు దగ్గరికి నిన్ను తీసుకెళ్తాం. వస్తావా ,మనం డాక్టరు దగ్గరికి వెళ్ళున్నాం అని అనాలి కదా. అదేం చెయ్యలేదు.నన్నుఏమీ అడగలేదు. నాకు కోపం వస్తోంది. ఎప్పుడూ వాళ్ళ ఇష్టమేనా. నాకు ఇష్టాయిష్టాలుండవా ఉంటాయి కానీ అడగరు. నేను వాళ్ళు చూపించిన ఆ డాక్టరు దగ్గరికి వెళ్ళను. ఏంచేస్తారో చూస్తాను. అని కోపంగా మనసులోనే అనుకున్నాను.

" డాక్టరు అంటే ఎవరున్నారు ? మీకు తెలిసిన వాళ్ళు ఎవరైనా ఉన్నారా ? ఎక్కడైనా బోర్డు చూసారా ? విన్నారా? " అంది అమ్మ ఏడుపు ఆపి.

" లేదు . ఇంతవరకూ ఆలాంటి బోర్డులని ఎక్కడా చూడలేదు. మనకి ఆ అవసరం కూడా రాలేదు. పక్కవీధిలో ఓ మల్టీ స్పాలిటీ హాస్పిటల్ ఉంది. అక్కడ ఎవరైనా ఉంటారేమో చూస్తాను. లేకపోతే సైకియట్రిస్ట్ ఎక్కడ ఉంటారో చెప్తారు. కనుకొస్తాను " అంటూ బయటికి వెళ్ళారు. ఓ పావుగంట తరవాత వచ్చారు.

" సైకియాట్రిస్ట్ గురించి కనుకున్నాను.వాళ్ళ పానెల్ లో ఓ సైకియాట్రిస్ట్ ఉన్నారుట. ఆవిడ పేరు శిఖా ఆ డాక్టరు శిఖా ఈ ఆసుపత్రికి రోజూ మధ్యాహ్నం పన్నెడు తరవాత వస్తారట. వచ్చి, ఓ గంట ఉంటారుట. అవసరం అయినప్పుడు కూడా టైముతో నిమిత్తం లేకుండా వస్తారుట, ఆవిడకో క్లినిక్ ఉందిట. ఆ క్లినిక్ కి పగలు మాత్రమే వస్తారుట, ఆ క్లినిక్ మనకి దగ్గరంటే దగ్గర కాదు కానీ, ఓ పది కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆవిడ ఫోన్ నంబరు అడిగి తీసుకునివచ్చాను. అపాయింట్ మెంట్ తీసుకుందాం. " అని వెంటనే ఆ డాక్టరుకి ఫోన్ చేసి మాట్లాడి అపాయింట్ మెంట్ తీసుకున్నారు.

" డాక్టరు గారు పన్నెండు గంటల వరకే ఉంటారుట, మనకి మనం తొమ్మిది గంటలకే బయల్దేరి వెళ్దాం. ఉదయం పది గంటలకి అపాయింట్ మెంటు ఇచ్చారు. ఆ సమయానికి రమ్మన్నారు "

" అయితే నేను ముందుగానే వంట అదీ చేసేస్తాను. తిరిగి వచ్చేసరికి ఎంత టైమైనా పరవాలేదు. మనం టిఫిన్ చేసి వెళ్దాం. " అంటూ శృతీని చూసింది.

జరుగుతున్నది నా విషయం కాదన్నట్లుగా టీవి చూస్తూ కూచున్నాను కళ్ళు ఆర్పకుండా వింటున్నాడు మానవ్. శృతిని ఆశ్చర్యంగా చూస్తూ తినడం మానేసాడు. ప్లేటులో పెట్టుకున్నవి అలాగే ఉన్నాయి. ఈమె జీవితంలో ఇంత భయంకరమైన గతం ఉందా? అదే అన్నాడు ఆమెతో.

" ఇంతకన్నా భయంకరమైనవి జరిగాయి. ఇంకా ఉన్నాయి. వింటారా? ఆపెయనా "

" ఆపద్దు. ఇంతవరకూ వచ్చాకా ఆపెస్తానననకండి. మీరు ఎలా నార్మల్ అయ్యారో తెలుసు కోవాలి. అయితే ఒక్కనిమిషం. వేరే ప్లేటులో మనకి వేరే పదార్థాలు వేసి తీసుకొస్తాను " అంటూ లేచాడు.

అలాగే అన్నట్లుగా తల ఊపి నవ్వింది. రెండు ప్లేట్లల్లో పెరుగు వడలు వేసి తీసుకొచ్చాడు. ఓ ప్లేటు ఆమె ముందుంచి చెప్పండి అన్నట్లు శృతిని చూసాడు. ఆమె అర్థం చేసుకుని మొదలు పెట్టింది

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments